# షాక్!

• తోలేటి జగన్మోహనరావు
• చిత్రాలు: నర్సిం

సాయంత్రం అయిదవుతుండగా బీచి రోడ్డు మీద ఓ ఎర్ర మారుతీకారు వచ్చి ఆగింది. వెనక తలుపు తెరవగానే ముద్దొచ్చేలా ఉన్న ఓ తెల్లటి బొచ్చుకుక్క కిందికి దూకి అటూ ఇటూ ఒకసారి పరిగెట్టి తోకాడిస్తూ నిలబడింది. దాని వెనకాలే ఓ యువకుడూ, ఆ యువకుడి వెనకాలే ఓ అందాల సుందరీ దిగారు. ఈలోగా డ్రైవరు సీట్లోంచి ఓ ముసలిపులి - బహుశా ఆ యువకుడి మామగారు కాబోలు - దిగి వచ్చి వాళ్ళ పక్కన నిలబడ్డారు.

ఆ ఎర్ర మారుతీకారు, ముచ్చటైన జంటా, ముద్దొచ్చే కుక్కపిల్లా, ముసలిపులీ - అంతా గ్రూపు ఫోటోలోలా అలా నిలబడితే, దూరం నుంచి వాళ్ళనే పరిశీలనగా చూస్తున్న నేను, ఆ యువకుడి అదృష్టాన్ని పొగుడుతూ, కొంచెం ఈర్ష్యతో, 'అదృష్టవంతే అదీ గురూగారూ - ఎన్ని జన్మల్లోనో పుణ్యం చేసుకుంటే తప్ప అలాంటి లైఫ్ దొరకదు' అన్నాను నా పక్కనే బీచిలో కూర్చున్న 'గురూ' గారితో.

గురువుగారికీ నాకూ పెద్ద పరిచయం ఏవీ లేదు. రోజూ సాయంత్రం నాలాగే బీచికి వస్తాడు, ఏదో పోగొట్టుకున్న వాడిలా అలా సముద్రం కేసి చూస్తూ కూర్చుంటాడు. అతనికి పాతికేళ్ళకంటే ఎక్కువ ఉండదుకాని గడ్డాలూ - మీసాలూ పెంచడం వలన కొంచెం వయసు ఎక్కువగా కనిపిస్తుంది.

వాళ్ళనే దీక్షగా చూస్తున్న గురూగారు - ఎన్నో జన్మల పుణ్యం అక్కర్లేదు - ఓ జన్మలో మోసం చాలు అన్నాడు ఉక్రోషంగా.

'అతను మీకు తెలుసా?' అని అడిగాను నేను.

'ఆ తేలుకొండిగాడి పేరు కొండల్రావు. స్టైయిలుగా యంకె రావు అని చెప్పుకుంటాడు. ఒకే ఊళ్ళో, ఒకే స్కూల్లో, ఒకే కాలేజీలో చదువుకున్నాం. ఒకే ఆఫీసులో ఒకే రోజు జాయినయ్యాం. సరళా వాళ్ళింటి ఔట్‌హౌస్‌లో ఉండేవాళ్ళం...'

'సరళెవరు?'

గురువుగారి గుండెల్లో నా ప్రశ్న కత్తిలా దిగబడింది కాబోలు. కొంచెంసేపు గిజగిజలాడి, కారు దగ్గర నిలబడ్డ అమ్మాయి కేసి చెయ్యి ఊపి చూపిస్తూ మొదలుపెట్టాడు.

ఔట్‌హౌస్‌లో దిగిన మర్నాడు ఉదయం ఏడింటికి లేచి యథాలాపంగా కిటికీ లోంచి గార్డెన్లోకి చూసేటప్పటికి ఓ మెరుపు మెరిసినట్టయింది. తోటలో వనకన్యలా మెరిసిపోతూ ఓ అమ్మాయి కనిపించింది.

'పెళ్ళి చేసుకుంటే ఈ అమ్మాయినే చేసుకోవాలి' అని మనసులో అనుకున్నానో లేదో అలా మాటలు నా చెవుల్లో పడేసరికి నేను ఆశ్చర్యపోయి వెనక్కు తిరిగాను. మాటలన్నది కొండిగాడు. నా వెనకాలే నిలబడి వాడు కూడా ఆ మెరుపునే చూస్తున్నాడు.

ఏవంటావు? అన్నాడు నేను వాడికేసి తిరగ్గానే.

యస్సంటానుకాని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నది నేను - 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అన్నాను వాడితో సమాధానంగా.

'అసలు ఈ ఔట్‌హౌస్‌లోకి ఏ ప్లానుతో దిగాననుకుంటున్నావు?' అన్నాడు వాడు సీరియస్‌గా.

'నువ్వే ప్లానుతో దిగావో నాకు తెలియదుకాని నేను మాత్రం ఆ అమ్మాయినే చేసుకోవాలని అరనిమిషం క్రితవే డిసైడ్ చేసేశాను' అన్నాను నేనూ సీరియస్‌గా.

'ఆ క్షణంలోనే ఇద్దరం బద్ధశత్రువులమైపోయామని ఇద్దరికీ అర్థమయింది. కొంచెంసేపు ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు సైలెంటుగా, సీరియస్‌గా చూసుకున్నాం. తర్వాత కొండిగాడే కొంచెం తగ్గి అన్నాడు - 'మనిద్దరం జెంటిల్మన్ ఎగ్రిమెంటుకొద్దాం - నువ్వూ ప్రేమించు, నేనూ ప్రేమిస్తా - విజయలక్ష్మి ఎవర్ని వరిస్తుందో చూద్దాం....'

'ఆ అమ్మాయి పేరు విజయలక్ష్మా?'

'విజయలక్ష్మి అంటే పేరు కాదు గాడిదా - సక్సెస్ అన్న మాట - నీకు తెలుగు కూడా అర్థవై చావదు కదా!

ఆ అమ్మాయి పేరు సరళ - ఏకైక పుత్రిక. ఇంట్లో ఉండేది మావగారూ, కుక్కాను - మావగారికి గార్డెనింగ్ హాబీ - ఆ మొక్కలంటే పంచప్రాణాలు - సరళకి వాళ్ళ నాన్న అయిదు ప్రాణాలు, కుక్క ఆరో ప్రాణం' అని ఇంట్లో ఉన్న ప్రాణాల లెక్క చెప్పి, ....'అత్తగారు ఆరు సంవత్సరాల నుంచీ స్వర్గంలో ఉంటున్నారు. మావగారి రాక కోసం ఎదురుచూస్తూ! అంచేత ఆయన నాలాంటి యోగ్యుడైన వరుణ్ణి చూసి సరళకి పెళ్ళి చేసేయాలన్న తొందరలో ఉన్నారు. చూశావా - జెంటిల్మన్లా నాకు తెలిసిందంతా ఏవీ దాచకుండా చెప్పేశాను' అన్నాడు కొండిగాడు.

'అంతా చెప్పావుకాని నువ్వు జెంటిల్మనంటేనే నాకు నమ్మకం కుదరడం లేదు. నువ్వెంత దొంగ వెధవ్వో నాకు తెలీదా - చిన్నప్పుడు కేరమ్సు ఆడుతుంటేనే చూడ్డం లేదనుకుని కాయిన్సు చేత్తో గెంటేసేవాడివి - నువ్వు ఫౌలాడని గేం లేదు' అన్నాను నేను అనుమానంగా.

'ఛ.....ఛ....చిన్నప్పుడు వేరు - ఇప్పుడు వేరు - ఇప్పుడు జెంటిల్మనైపోయానని చెబుతున్నాను కదా.....' అని వాడు అంటుండగా, ఓ ఉరుము ఉరిమినట్లు 'హలో' అన్న శబ్దం వినిపించింది. ఇద్దరం బెదరిపోయి వెనక్కి తిరిగి చూశాం. గుమ్మానికి అడ్డంగా, ఆ గుమ్మానికి సంపూర్ణ గ్రహణం కమ్మేసినట్లు ఓ స్థూలకాయం నిలబడి మమ్మల్ని పలకరిస్తోంది. స్థూలకాయం కాళ్ళ దగ్గర ఓ తెల్లటి బొచ్చుకుక్క నిలబడి నోరు తెరిచి, 'ఎవర్రా మీరు?' అన్నట్లు చూస్తోంది.

కొండిగాడు మోచేత్తో నన్నో పోటు పొడిచి రహస్యంగా చెవిలో 'మావగారు' అన్నాడు.

'హలో....హలో....' అన్నాను నేను ఉలిక్కిపడి కంగారుగా.

మావగారు లోపలికి రెండడుగులు వేశారు. కుక్కపిల్ల నాలుగడుగులు ముందుకేసి, నా ఎదురుగా నిలబడి, 'నీ పేరేవిట్రా?' అన్నట్లు నాకేసి కళ్ళు చికిలించి చూసింది.

నాకు కుక్కలంటే చచ్చే భయం. చిన్నప్పుడు ఓసారి కుక్క కరిస్తే బొడ్డు చుట్టూ ఎనిమిదో, పదహారో ఇంజక్షన్లు పొడిచేసేరు. అయినా, ప్రేమ భయాన్ని జయించింది. మావగార్నీ కుక్కపిల్లనీ చూడగానే సరళ హృదయాన్ని జయించడానికి బ్రహ్మాండమైన అయిడియాలు బుర్రలోంచి తన్నుకొచ్చాయి.

'కుక్కపిల్ల చాలా బావుంది' అన్నాను దాన్ని ఎత్తుకుంటూ.

'వాణ్ణి కుక్కపిల్లనకు. టామీ అని పిలు' - మావగారు గాండ్రించారు. 'టామీగాడు మా ఫామిలీ మెంబరు.'

'ఇకనుంచీ నేను కూడా మీ ఫేమిలీ మెంబరే అనుకోండి' అని మావగారికి కొంచెం మస్కా కొట్టి, టామీగాణ్ణి ముద్దాడుతుండగా, 'టా....మీ...' అని పిలుస్తూ వచ్చింది సరళ. టామీగాడు నా చేతుల్లోంచి దూకి సరళ దగ్గరకు వెళ్ళిపోయాడు.

'వీళ్ళే అమ్మాయి - మన ఔట్‌హౌస్‌లో అద్దెకు వచ్చింది' అన్నారు మావగారు, మమ్మల్ని పరిచయం చేస్తూ. 'వెధవది - నాకు పేర్లు గుర్తుండవోయ్ - నీ పేరేవిటన్నావు?' అనడిగాడు కొండిగాడికేసి తిరిగి.

వాడు నోరు విప్పడానికి అవకాశం ఇవ్వకుండా, 'వాడి పేరు కొండిగాడండి. నా పేరు శంకరం అండి' అన్నాను నేను సరళకేసి తిరిగి.

'నమస్తే' అంది సరళ.

'నమస్తే' అన్నాను నేను.

'మళ్ళీ కలుద్దాంలే' అంటూ మావగారు దారి తీశారు. వాళ్ళు వెళ్ళిపోగానే కొండిగాడు చిటపటలాడుతూ, 'ఒంటరిగా ఉన్నప్పుడు అంటే అన్నావుకాని సరళ ఎదురుగా 'కొండిగాడని' అలా బోదురు కప్పలా అరుస్తావేం?' అన్నాడు ఉడుకు మోత్తనంతో. వాడి పేరు గురించి వాడింత ఇదవుతాడని నాకు అంత వరకూ తెలియదు. అది తెలిసిన తర్వాత ఇంక సరళ ముందు ఎప్పుడూ కొండిగా అని పిలవాలనే నిర్ణయాని కొచ్చేశాను.

'అది సరేకాని, సరళకి మావగారంటే ఎన్ని ప్రాణాలు?' అనడిగాను నా ప్లానుకి ఓ రూపం ఇస్తూ.

నీ పేరేవిటన్నావు?' అనడిగాడు మామగారు కొండిగాడికేసి తిరిగి. వాడు నోరు విప్పడానికి అవకాశం ఇవ్వకుండా, 'వాడి పేరు కొండిగాడండి. నా పేరు శంకరం అండి' అన్నాను నేను సరళకేసి తిరిగి.

'అయిదు.'

'మావగారికి తోట?'

'అయిదు.'

'టామీగాడు?'

'ఆరవ ప్రాణం - ఏం - ఎందుకలా అడుగుతున్నావు?'

'ఓ నెల లోపున ఈ వదకొండు ప్రాణాలు నా గుప్పిట్లో ఉంటాయి' అన్నాను నేను చిరునవ్వు నవ్వుతూ.

'ఎలా?'

'చూడు' అన్నాను.

మర్నాడు తెల్లవారగట్లే నా ప్లాను అమలులో పెట్టాను.

రోజూ పొద్దుటే మావగారూ, టామీగాడూ మార్నింగ్ వాక్‌కి వెడతారు. ఆయన బుర్ర అప్పుడు ఫ్రెష్‌గా ఉంటుంది. కాబట్టి ఇద్దర్నీ జాయింటుగా బుట్టలో వెయ్యడానికి బంగారంలాంటి ఛాన్సు అది. అంచేత తెల్లవారగట్ల నాలుగున్నరకి అలారం పెట్టి వడుకున్నాను.

నాలుగన్నరకి అలారం గణగణా ఫైరింజన్లా మోగుతుంటే మెలకువ వచ్చింది. గబగబా మంచం మీంచి దూకి బట్టలు, బూట్లు వేసుకుంటుంటే కొండిగాడు ముసుగు తీసి తల బయటికి పెట్టి, 'ఏం రోగవొచ్చిందీ - పొద్దుటే అలారం పెట్టి లేపేశావు' అన్నాడు చికాగ్గా.

'మార్నింగ్ వాక్‌కి వెడుతున్నాను.'

'ఈ జబ్బు ఎప్పట్నుంచీ?'

'ఇవాల్టినుంచే.'

ఇంతలో తలుపు తీసిన చప్పుడయింది. 'నే వెడుతున్నా - తలుపేసుకో. వాళ్ళు వచ్చేస్తున్నారు' అన్నాను.

'ఎవరూ?'

'మావగారు, టామీగాడు.'

వాడి నిద్రమత్తంతా వదిలిపోయింది. 'అమ్మ దొంగ వెధవా...' అంటూ నోరు తెరిచి లేచి కూర్చున్నాడు. వాడి నోరు నొక్కేసి, టాటా చెప్పి, మావగార్ని కలిశాను, 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ.

ఆయన సోడాబుడ్డి అద్దాలు సరిచేసి నన్ను చూసి, 'నువ్వూ మార్నింగ్ వాక్‌కి వెడతావన్న మాట - గుడ్ - అలా ఉండాలయ్యా - ఈ కాలం కుర్రాళ్ళు రాత్రి పన్నెండుదాకా రోడ్ల మీద అడ్డగాడిదల్లా తిరగడం, ఎనిమిదింటికి లేవడం - అమెరికాలో అయితే రోజూ జాగింగ్.....'

మావగారికి మంచి ఇంప్రెషన్ కలిగించానన్న సంతోషం అయిదు నిమిషాలు కూడా నిలవలేదు. వలకరించగానే జోరీగలా తగులుకున్నారు. నికరాగ్వేలో ఎన్నికల గురించీ, బోఫోర్సు గురించీ, వాతావరణ కాలుష్యం గురించీ, న్యూజిలాండులో మావోరీ తెగవారి జీవన విధానం గురించీ. నాన్-స్టాప్‌గా మాట్లాడటం మొదలు పెట్టారు. మావగారికి ఆన్ స్విచ్చేకాని ఆఫ్ స్విచ్ ఉన్నట్లు లేదు - అరగంటయినా ఆగే సూచనలు ఎక్కడా కనిపించలేదు. ఆయన ప్రసారం ఎప్పుడు ముగిస్తారో తెలియక కంగారుపడి, కనీసం స్టేషనేనా మారుద్దామని, 'టామీగాణ్ణి నాకివ్వండి సార్' అన్నాను - టామీగాడు మావగారికంటే ప్రమాదకరమైనవాడని తెలియక.

'వాడు నిన్ను విసిగిస్తాడయ్యా' అన్నారు మావగారు, తల్లి తన అల్లరి పిల్లాణ్ణి వక్కింటావిడకు అంటగడుతూ ముద్దుగా అన్నట్లు.

'ఫరవాలేదు సార్ - నాకు చాలా సరదా' అన్నాను గొలుసు అందుకుంటూ.

అంతవరకూ మెల్లిగా నడుస్తున్న టామీగాడు నేను గొలుసు పుచ్చుకున్న తర్వాత హుషారుగా నన్ను ఈడుస్తూ పరిగెట్టడం మొదలుపెట్టాడు. ఊపిరి బిగబట్టి వాణ్ణి వెనక్కు లాగుతూ వాడి వెనకాలే నేను పరిగెట్టాను.

అలా పరిగెట్టి పరిగెట్టి, ఓ చోట ఠక్కున ఆగిపోయాడు వాడు. గుర్రు గుర్రుమంటూ మెల్లిగా వెనక్కు వెనక్కు జరిగి నా కాళ్ళ మధ్యకు వచ్చేశాడు. ఏవిటా అని చూస్తే రోడ్డు వక్కగా నిలబడి ఓ ఊరకుక్క మాకేసి తీవ్రంగా చూస్తూ కనిపించింది. దాన్ని చూపించి, నాకేసి తిరిగి, 'దాన్ని తన్ను' అన్నాడు టామీగాడు.

టామీగాడిలో ఏ కుక్కలోనూ నేనెప్పుడూ చూడని ప్రత్యేకత ఒకటుండేది. వాడికి మాటలు రావుగాని తోక ఊపి, తల కదిపి, కళ్ళు చికిలించి, చిందులు






తొక్కి, వాడు చెప్పదలుచుకున్న దేవిటో స్పష్టంగా మాట్లాడినట్లు చెప్పేసేవాడు. వాడికేసి చూడగానే వాడు ఏవంటున్నదీ నాకు ఎలా తెలిసేదోకాని తెలిసిపోయేది.

'దాని గొడవ నీకెందుకురా - నీ దారిన నువ్వు నడు' అన్నాను టామీగాడితో- ఈ కుక్క జట్టీల్లో దిగడం ఇష్టం లేక.

వాడి దారిన వాడు నడవలేదు. నా అనరా దొరికిందన్న ధైర్యంతో, 'భౌ....భౌ...' అని నన్ను గుంజుతూ ముందుకి దూకాడు - 'అడ్డు తప్పుకోండి - మహారాజుగారు వస్తున్నారు' అంటూ.

ఊరకుక్క స్ట్రీట్ ఫైట్సులో ఆరితేరిన రకం కాబోలు - 'నీలాంటోళ్ళని చాలా మందిని చూశాంలే' అన్నట్లు తాపీగా తోక లేపి, రోడ్డుసైడు నుంచి సెంటరులోకి వచ్చి అడ్డంగా నిలబడి భౌ...భౌమని ఛాలెంజి చేసింది. టామీగాడు తోకదింపి ముడుచుకు పోయి మళ్ళీ కాళ్ళ మధ్య దూరాడు.

**ఎక్కడ ఏ సారవంతమైన మెదడులో దేశం కోసం పరుగు అనే ఆలోచన మెదిలిందో కానీ, మావగారికి నన్ను హింసించ డానికి కొత్త ఆయుధం దొరికింది.**

ఈ లోపున మమ్మల్ని కలునుకున్న మావగారు, 'ఇది అందుకో' అన్నారు లాఠీ అందిస్తూ.

'ఎందుకు?' అన్నాను అయోమయంగా.

'దీంతో ఆ వెధవకుక్కని ఒకటందుకో.'

'నేనా?' - ఛాలెంజి చేసింది టామీ గాడు - యుద్ధం నేను చెయ్యాలట.

'నువ్వే' గంభీరంగా అన్నారు మావగారు నా కళ్ళలోకి సూటిగా చూస్తూ.

హిప్నొటైజు చెయ్యబడ్డ వాడిలా నేను కర్ర తీసుకు కదలగానే టామీగాడు మళ్ళీ తోక లేపి ముందుకి దూకాడు. స్ట్రీట్ ఫైటర్ తోక దించకుండానే ఒక అడుగు వెనక్కు వేసి, యుద్ధశంఖం పూరించినట్లు తల పైకెత్తి కుయ్యోమని దీర్ఘంగా అరిచింది. ఆ సిగ్నలందుకుని దాని సైన్యం వచ్చేసి మమ్మల్ని చుట్టుముట్టేసింది.

'భౌ...భౌ....భౌ...' - నా చుట్టూరా ఓ అరడజను కుక్కలు చేరి అరవడం మొదలుపెట్టాయి. టామీగాడిని రక్షించడానికి కాకపోయినా. ప్రాణ భయంతో లాఠీ గిరగిర తిప్పసాగాను. శత్రు సైన్యం రెండు నిమిషాలు దూరం నుంచే అరిచి అరిచి అలిసిపోయి యుద్ధవిరమణ చేసి సందుల్లోకి వెళ్ళిపోయింది.

'శభాష్....' అన్నారు మావగారు. అంతవరకూ ఆయన రోడ్డు పక్కన తూము రాయి మీద సేఫ్ డిస్టెన్సులో కూర్చుని, బాల్కనీ సీటులోంచి చూస్తున్నట్లు చూస్తున్నారు - 'ఈ ఊరకుక్కలతో చచ్చే చావొచ్చిందయ్యా - నువ్వు బాగానే టాకిల్ చేశావు' అన్నారు. టామీగాడు కూడా, 'బాగానే స్టంటు చేశావురోయ్ - సుప్రీం హీరోలా' అని తోకాడించి మెచ్చుకున్నాడు.

ఆ పాటికి నిమిషానికి మూడు వందలసార్లు కొట్టుకుంటున్న గుండె కొంచెం స్పీడు తగ్గి రెండు వందలసార్లకి దిగి, కొంచెం నోరు పెగిలింది నాకు - '.....వెధవ....కు....క్క.....లకి.....భయపడితే....ఎలా సార్...' అన్నాను.

మార్నింగ్ వాక్ అలా ముగిసి గార్డెన్లో కుర్చీలో కూలబడ్డాక టేపురికార్డరు ఆన్ చేసి, శాస్త్రీయ సంగీతం పెట్టి, 'ఇది ఎందుకు పెట్టానో తెల్సా?' అనడిగారు మావగారు.

'మీకు శాస్త్రీయ సంగీతవంటే ఇష్టం కాబోలు.'

'నాకు సరే, ఈ మొక్కలకి...' అంటూ సర్ జగదీష్ చంద్రబోస్ పరిశోధనల గురించి వివరించి, '...చూడు - మొక్కలు సంగీతవంటే చెవి కోసుకుంటాయయ్యా- సంగీతవంటే అల్లాటప్పా సంగీతం కాదు - సజీవమైన శాస్త్రీయ సంగీతం' అని చెప్పారు. ఆయన మొక్కలకి ఉదయం, సాయంత్రం రోజూరెండుగంటలు శాస్త్రీయ సంగీతం వినిపించి బెండ కాయలంత మిరపకాయలు, బీరకాయలంత బెండకాయలు, దోసకాయలంత టమోటాలు పండిస్తారుట.

'ఈ దెబ్బతో కృషి పండిట్ అవార్డు రావాలి మనకు' అన్నారు, ఆ సబ్జక్టు మీద అనర్గళంగా ఓ రెండు గంటలు మాట్లాడి.

ఆ రోజు నుంచీ మావగారూ, టామీ గాడూ, రాహు కేతువుల్లా నన్ను తగులు కుని తినియ్యడం మొదలు పెట్టారు. అలా ఓ నెల రోజులు గడిచేసరికి వాళ్ళ ప్రాణాలు నా చేతుల్లోకి రావడం దేవుడెరుగు కాని, నా ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చింది. నా ఎడం చెయ్యి భుజం దగ్గర్నుంచి క్రింది వరకు లాగడం ప్రారంభించింది. మొదట అంతగా పట్టించుకోలేదుకాని, రాను రాను నొప్పి ఎక్కువైపోయింది. ఓ రోజు రాత్రి పడుకోబోతూ కొండిగాడికి ఆ విషయం చెప్పాను.

'నొప్పా - ఎడం చెయ్యిలోనా?' అన్నాడు వాడు కొంచెం ఆత్రత కనబరుస్తూ.

'ఎడం చెయ్యిలోనే - ఏం.'

'నేనెక్కడో చదివాను - హార్టెటాక్ వచ్చే ముందు అలా ఎడం చెయ్యి లాగుతుందట - ఎందుకైనా మంచిది - ఓసారి డాక్టరుకి చూపించుకో - పాపం, పెళ్ళి కూడా చేసుకోబోతున్నావు' అని ఓ బాంబు పేల్చి ముసుగు తన్నేశాడు వాడు.

ఇంక నాకు ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. మర్నాడు మా బామ్మకి ఆరోగ్యం బాగోలేదని కారణం చెప్పి, ఓ పదిహేను రోజులు సెలవు పెట్టి మా ఊరు వెళ్ళాను.

'నీ గుండెకేం పరవాలేదు - గుండులా ఉన్నావు' అన్నాడు నన్ను, నాలుగు రోజులూ అన్ని టెస్టులు చేసిన కార్డియాలజిస్టు. ఎందుకైనా మంచిది - ఆర్థోపెడిక్ స్పెషలిస్టుకి చూపించు' అని సలహా ఇచ్చాడు. ఓ అయిదు వందలు తీసుకుంటూ. ఇంకో అయిదొందలు నా దగ్గర్నుంచి లాగేశాక ఆర్థోపెడిక్

స్పెషలిస్టుగారు ఆర్థోపెడిక్ ప్రాబ్లం ఏవీ లేదని నిర్ణయానికొచ్చి, 'ఓసారి న్యూరాల జిస్టుకి చూపించు - ఎందుకైనా మంచిది' అన్నాడు.

మరో అయిదొందలు వదిల్చి 'నీ నరాలు ఉక్కు తీగల్లా ఉన్నాయని సంతోషించాడు న్యూరాలాజిస్టు. నేను కూడా సంతోషించి లేవబోతుంటే, 'ఆగు - నీ తల కొంచెం వాచినట్టుగా ఉందేమిటి? ఓసారి నీ బుర్ర స్కేనింగ్ చేద్దాం - ఎందుకైనా మంచిది' అని ఏదో అనబోతుండగా, 'ఇది మావగారి దెబ్బ సార్ - అంతకంటే ఏమీలేదు' అని ఆయనకు నమస్కారం చేసి పరిగెట్టాను నేను.

ఈలోగా మా బామ్మ రోజూ నూనె రాసి మర్దనా చేసి కాపడం పెడుతూనే ఉంది. బామ్మ కాపడం పెట్టడంవలనో, లేకపోతే నా దగ్గర్నుంచి పదిహేనొందలు లాగేసిన మనీ స్పెషలిస్టుల దీవెనల చలవో కాని రెండు వారాల్లో నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. అయితే, నొప్పికి కారణం మాత్రం నాకు అప్పుడు తెలియలేదు.

మళ్ళీ 'డ్యూటీ'లో జాయినయ్యి టామీగాణ్ణి తిప్పడం మొదలుపెట్టిన తర్వాత నొప్పి ప్రారంభమవడంతో అసలు కారణం తెలిసింది. గొలుసు ఎడం చేత్తోనూ, లాఠీ కుడిచేత్తోనూ పట్టుకుని టామీగాణ్ణి షికారుకు తీసుకెడతానుకదా! టామీగాడు దారిలో ఏ పిచిక కనిపించినా, కాకి కనిపించినా దాని మీదకు దూకుతాడు. టామీగాడు ఓ రోజున ఓ ఊరకుక్క మీదకి దూకబోతుంటే వాణ్ణి వారిస్తూ వెనక్కు లాగినప్పుడు భుజం కలుక్కుమని నొప్పికి కారణం తెలిసొచ్చింది.

'ఓరి వెధవా...' అని పోయిన పదిహేను వందలూ గుర్తుకొచ్చి అనాలోచితంగా టామీగాణ్ణి ఒక్కటేశాను లాఠీతో - వాడు కుయ్యోమని ఎగిరి గంతేశాడు.

మావగారు రోడ్డుమీద ఆగిపోయి, 'వాడినెందుకు కొట్టావు?' అనడిగాడు తీవ్రంగా.

'వాణ్ణి కాదు సార్' అన్నాను నేను తెలివి తెచ్చుకుని.

'మరి?' అన్నారు ఆయన తెల్లబోయి.

'ఊరకుక్కని సార్ - దాన్ని కొడదామనుకుంటే పాపం మన టామీగాడికి తగిలింది దెబ్బ' అన్నాను ఏదో సమర్థిస్తూ.

'నేనూ - టామీగాడు తప్ప ఎవరూ లేరే' అన్నారు మావగారు ఆశ్చర్యపోతూ.

'లేరా? అరే నాకు స్పష్టంగా ఊరకుక్క కనిపించిందే' అన్నాను దబాయిస్తూ.

ఆయన మాట్లాడకుండా నన్ను ఎగాదిగా చూసి, 'నీకు పిచ్చికాని లేదుకదా' అనడిగారు అనుమానంగా.

నేను ఏదో చెప్పానుకాని, నా సమాధానంతో ఆయన సంతృప్తి చెందలేదు. టామీగాడి మీద ఎవరు చెయ్యి చేసుకున్నా సహించేది లేదని హెచ్చరించారు.

'సరే సార్' అన్నాను నేను చెయ్యి రుద్దుకుంటూ.

ఇంకా ఆ చేతి నొప్పి నుంచి పూర్తిగా కోలుకోలేదు. మరో ప్రమాదం వచ్చిపడింది.

ఓ రోజు టీవీలో వెన్నెల తగిలితే కందిపోయేలా ఉన్న కోమలాంగి దేశం గురించి, దరిద్రం గురించి, ఇరవై ఒకటవ శతాబ్దం గురించి ఏదో మాట్లాడి, 'ఐ రన్ ఫర్ మై కంట్రీ - డు యు?' అనడిగింది ముద్దు ముద్దుగా.

'యస్' అని పులిలా గాండ్రించారు మావగారు - నా చెవిలో.

మర్నాడు తెల్లవారకట్లే తెల్లలాగూ, తెల్ల బనీను వేసుకుని సున్నపు కుండలా దొర్లుకుంటూ వచ్చినట్లు వచ్చేసి 'రన్ మాన్' అనరిచారు.

'ఎక్కడికి?' అనడిగాను భయం భయంగా.

'రన్ మాన్ - రన్ ఫర్‌ది కంట్రీ - దేశం కోసం - పరిగెట్టు' అనరుస్తూ పరుగు తీశారు. ఆయన వెనకాలే నేను. నా వెనకాల టామీగాడు - అలా ఓ వంద గజాలు పరిగెట్టామో లేదో ఆయన నిషా దిగిపోయింది. అలసిపోయి రోడ్డు పక్కన గడ్డిలో కూలబడ్డారు.

'నాది పరిగెట్టే వయసు కాదయ్యా' అన్నాడు వగరుస్తూ. ఆయన వెనకాలే ఉన్న నాకు ఆయన మాటలు సంగీతంలా వినిపించాయి.

'పోనిద్దురూ - వెధవ పరుగు - ఇంట్లో కాలు కార్లోనూ, కార్లో కాలు ఇంట్లోనూ ఉండేవాళ్ళు సంవత్సరానికి సరదాగా అలా టీవీలో దేశం కోసం పరిగెట్టాలి. కానీ, మన బ్రతుకే ఓ పరుగు - ఇంక ఈ వెధవ పరుగెందుకు సార్ విశ్రాంతి తీసుకుందాం' అన్నాను నేను ఆయన పక్కన కూలబడి.

'వెధవ పరుగు - విశ్రాంతి తీసుకుంటావా?' - నన్నొక సమాజ విద్రోహక, దేశ విద్రోహక శక్తిని చూసినట్లు చూసి, 'లే' అని తుపాకీ పేలినట్లు పేలారు మావగారు.

నేను ఉలిక్కిపడి లేచాను.

టామీగాడు కూడా నన్ను స.వి. దే.వి శక్తిని చూసి నట్టు చూసి 'పరుగెట్టు' అనరిచాడు.

దేశం కోసం త్యాగాలు చెయ్యమనడం విన్నాను. కష్టపడి పని చెయ్యమనడం విన్నాను. కానీ, దేశం కోసం పరిగెట్టడమేమిటో, నేనూ, టామీ వెధవా పరిగెడితే దేశం ముందుకు ఎలా, పోతుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఎక్కడ ఏ సారవంతమైన మెదడులో దేశం కోసం పరుగు అనే ఆలోచన మెదిలిందో కానీ, మావగారికి నన్ను హింసించడానికి కొత్త ఆయుధం ఒకటి దొరికింది. విశ్వశాంతికనీ, బాలల దినం అనీ, స్త్రీ విముక్తి అనీ, వాతావరణ కాలుష్యం అనీ, దేశంలో ఏ సమస్య ఎదురైనా నన్ను పరుగెట్టించడం మొదలుపెట్టాడాయన.

టామీగాడు, మావగారు పెట్టే చిత్రహింసలతో నేను శారీరకంగా, మానసికంగా శిథిలమైపోయాను. ఇంకో వారం రోజులు ఈ హింస కొనసాగితే నాకు పిచ్చెక్కడం ఖాయం అనుకుంటుండగా మావగారు శుభవార్త చెప్పారు. 'మేం ఓ నెలరోజుల పాటు ఊరువెడుతున్నామోయ్ - తోటా అదీ జాగ్రత్తగా చూస్తూండు - నీళ్ళు పోసి, మర్చిపోకుండా సంగీతం వినిపించు' అన్నారు. ఆ వార్త వినగానే నాకు ఎగిరి గంతెయ్యాలనిపించింది. నా సంతోషాన్ని దాచుకుని, 'మొక్కల గురించి మీరు చెప్పాలా సార్ - మీరొచ్చేటప్పటికి అవి ఎలా ఉంటాయో చూడండి' అని హామీ ఇచ్చి, దిగులుగా ముఖం పెట్టి, 'ఓ నెలరోజుల పాటు మిమ్మల్ని మిస్సవుతాను సార్ - పోనీ టామీగాణ్ణయినా ఉంచెయ్యకూడదా - నాకూ సరదాగా ఉంటుంది' అన్నాను గొప్పగా.

'నేనూ సరిగ్గా అదే అనుకుంటున్నానోయ్ - వాడికీ ప్రయాణాలంటే ఇష్టం ఉండదు' అన్నారు మావగారు.

నా గుండెల్లో రాయి పడింది. ఇలాంటి ప్రమాదం ముంచుకొస్తుందని తెలిస్తే నేను ఏదో వంక పెట్టి ఉడాయించేవాణ్ణి కానీ, స్వయంగా ఇలా ఉచ్చు మెడకి తగిలించుకునేవాణ్ణి కాదు.

ఆ రోజునుంచీ టామీగాడితో చచ్చే చావొచ్చి పడింది. వాణ్ణి పొద్దుటే షికారుకి తీసుకెళ్ళి వాడి ఎంటర్‌టెయిన్‌మెంటుకి కుక్కలతో యుద్ధం చేశాను. స్నానం చేయించి, బ్రష్ చేసి, పాలు పట్టించి, తిండి పెట్టి, 'బజ్జోరా నాన్నా' అని పడుకోబెట్టి, ఆఫీసుకి వెళ్ళి సాయంకాలం తిరిగి వచ్చేటప్పటికి మళ్ళీ అంట్ల వెధవలా తయారై కూర్చున్నాడు. సాయంకాలం షికారూ, వినోద కార్యక్రమాలూ, మళ్ళీ స్నానం.

'ఇదేవిటి - ఈ వెధవ సబ్బుతో రుద్దుతున్నావు?' అన్నాడు టామీగాడు చికాగ్గా, వాణ్ణి రుద్దడానికి సబ్బు తియ్యగానే.

'మరి దేంతో రుద్దాలిరా?'

'దానితో ' అన్నాడు టామీగాడు - నా కోసవని తెచ్చుకున్న ఇంటర్నేషనల్ లగ్జరీ సబ్బు చూపిస్తూ.



'అది సినీ తారల సౌందర్య సబ్బురా - నీ కుక్క మొహానికిది చాల్లే.'

'నువ్వేవన్నా సినీతారడివా - నీదీ కుక్కమొహమే కదా -. నీ కెందుకు?'

'వెధవా - నీకూ నాకూ సాపత్యమేమిటి-వెధవ వాగుడు వాగకు' అని చెంబుడు నీళ్ళు పోశాను. టామీగాడు బాత్రూంలోంచి ఛంగున ఎగిరి గార్డెన్లోకి పారిపోయి నిరననగా మళ్ళా మట్టిలో పొర్లసాగాడు. వాణ్ణి బతిమాలి, మళ్ళీ బాత్రూంలోకి తీసుకొచ్చి, సినీతారల సౌందర్య సబ్బుతో స్నానం చేయించేటప్పటికి నా తలప్రాణం తోకకొచ్చింది. ఎనిమిది రూపాయల సబ్బు నాలుగు రూపాయల సబ్బు అయింది.

'ఇదీ స్నాన సుఖం' అంటూ టీవీ ఎడ్వర్టయిజ్‌మెంటు సుందరిలా ఒళ్ళంతా అటూ ఇటూ కదిపి నీళ్ళు విదిలిస్తూ, 'అలా రాయిలా చూస్తూ నిలబడతావేం - తుడిచి బ్రష్ చెయ్యి' అన్నాడు. వాడికి బ్రష్ చేసి, బయటకు పంపించి, నేను స్నానం చేస్తుంటే, 'ఆ బాత్రూంలోంచి తగులడతావా - నన్ను తినెయ్యమంటావా,' అనరిచాడు కొండిగాడు, హొటల్నుంచి అప్పుడే వచ్చిన కేరియర్ విప్పుతూ.

నేను భోజనానికి కూర్చోగానే కొండిగాడు నాకేసి ఎగాదిగా చూసి, 'నీ ఆరోగ్యం బాగాలేదా?' అనడిగాడు.

'ఏం? బాగానే ఉందే' అన్నాను ఆశ్చర్యపోయి.

'గులాబీ మల్లెల సబ్బులు, కలోన్ నిమ్మకాయ సబ్బుల మంచి గంధ పరిమళాలు కాక, ఆరోగ్యానికి రక్షణ నిచ్చే కంపు కొడుతుంటే అనుమానం వచ్చి అడిగాను' అన్నాడు వాడు.

'టామీగాడు నా సబ్బు వాడేశాడు కదా - వాడి సబ్బుతో నేను రుద్దుకున్నాను' అన్నాను దుఃఖంతో.

**రాత్రి పన్నెండు అవుతుండగా దుడ్డు కర్ర తీసుకుని హాలువైపు నడిచాను. టామీ వెధవకి రెండు పూటలా తిని నన్నేడిపించడమే కానీ, కుక్కకుండాల్సిన లక్షణాలేవీ లేవు.**


'ఏడీ వాడు?'

'ఎక్కడో తగలడ్డాడులే - భోంచేద్దాం.'

మా భోజనాలైనా టామీగాడి అజా పజా లేదు.

'ఏమైపోయాడు వీడు?' అన్నాడు కొండిగాడు ఆశ్చర్యంగా.

'వీడు మళ్ళీ మట్టిలో దొర్లొచ్చి స్నానం చేయించమనడు కదా' అన్నాను భయం భయంగా. మరో అరగంట వాడికోసం వెతికి వెతికి, 'వాడే వస్తాడులే' అనుకుని మంచం మీద వాలబోతూ, బెడ్‌మీద మెత్తగా తగిలి, 'అమ్మోయ్' అని ఎగిరి గంతేశాను. అదే సమయంలో మల్లెపువ్వు లాంటి బెడ్‌షీటు కింద నుంచి 'కుయ్యో' మూలుగు వినిపించింది. మరుక్షణంలో బెడ్‌షీటు కింద నుంచి టామీగాడు ప్రత్యక్షమయ్యాడు.



'కళ్ళు కనబడ్డంలా - అలా మీద కూర్చుంటావు - కొంచెం ఉంటే చచ్చేవాడిని' అన్నాడు టామీగాడు కోపంగా.

'వెధవా - లే' అన్నాను నేను.

'లేచను' అన్నాడు టామీగాడు ముడిచిపెట్టుకు పడుకుంటూ.

'తన్ని తగిలేయ్ వెధవని - అలా నెత్తికెక్కించుకోకు' అన్నాడు కొండిగాడు నన్ను రెచ్చగొడుతూ.

'ఏం చెయ్యమంటావ్?'

'హాల్లో కట్టేసేయ్.'

కొండిగాడు అలా అనగానే టామీగాడు ఉండచుట్టుకు పోయి కుంయి కుంయి మని గోల చెయ్యడం మొదలుపెట్టాడు. వాణ్ణి మంచం మీంచి ఈడ్చి, సరళా వాళ్ళింటి హాల్లో కట్టేశాను.

మర్నాడు మార్నింగ్ వాక్ అయిన తర్వాత టేపు రికార్డరు ఆన్ చెయ్యగానే, 'ఏమిటి గురూ ఈ సంగీతం ముసిలాళ్ళలా - సరదాగా హుషారు సంగీతం వినాలి గాని అంటూ పాప్ మ్యూజిక్ క్యాసెట్ ఇచ్చాడు. నేను పాప్ మ్యూజిక్ పెట్టగానే టామీగాడు పరిగెట్టుకొచ్చి, 'అపరేయ్ నాకు పిచ్చెక్కుతోంది' అన్నాడు తల కొట్టుకుంటూ.

'వాడికి పిచ్చెక్కుతోందట' అన్నాను కొండిగాడితో.

'అయితే, ఇంకా వాల్యూం పెంచు-వెధవకి రోగం కుదురుతుంది' అన్నాడు కొండిగాడు.

నేను వాల్యూం పెంచాను. టామీగాడు కుయ్యోమని ఎగిరి గంతేసి హాల్లోకి పరిగెట్టాడు, 'నా తల పగిలిపోతోందిరోయ్' అంటూ.

టామీగాడికి తడిగుడ్డల్తో గొంతు కొయ్యడం తప్ప ఓపెన్ ఫైట్లు ఇష్టం ఉండదు. అంచేత 'సరే - నీ ఇష్టం వచ్చినట్లు నువ్వేడు. నిన్నింతకింతా ఏడిపించకపోతే నా పేరు టామీ కాదు' అన్నట్లు హాల్లోంచి సైలెంటుగా చూస్తూ కూర్చున్నాడు. వాడి చూపుల్లో వార్నింగు నాకు అర్థం అయినా అప్పుడు పట్టించుకోలేదు గాని, ఆ రోజు నుంచీ నన్ను వేపించుకు తినెయ్యడం మొదలుపెట్టాడు వాడు. అలా మూడు వారాలయ్యేటప్పటికి టామీగాణ్ణి మర్డరు చెయ్యడమో, నేను ఆత్మహత్య చేసుకోవడమో ఏదో ఒకటి జరగక తప్పదనే పరిస్థితి వచ్చేసింది.

'వెధవని నెత్తికెక్కించుకుంటున్నావు. నువ్వు ఇలాగే వాడు ఆడించినట్లల్లా ఆడేవంటే, వాడి మెళ్ళో గొలుసు నీ మెడలో వేసి, షికారు తిప్పి, వాడి పళ్ళెంలో నీకు పాలు పోసి పట్టించి, నీ పాంటూ షర్టూ వేసుకుని ఆఫీసుకి వెడతానని మారాం చేసినా ఆశ్చర్యపోను' అన్నాడు కొండిగాడు.

'ఏం చెయ్యను?' అన్నాను నీరసంగా.

'వాడి కాళ్ళూ చేతులూ విరగ్గొట్టేసేయ్ - నరేలే - నీ వల్ల ఏం కాదు - వాడి తోక పుచ్చుకుని ప్రేమగోదారి ఈదుతున్నావు కదా - అంతర్వేది సముద్రంలో తేలుదువుగానిలే' అన్నాడు కొండిగాడు హేళనగా.

'నువ్వు నా ప్లేసులో ఉంటే ఏం చేసేవాడివి?'

'నేనా, వాడిని చావగొట్టేసేవాణ్ణి.'

'వాడు మావగారికి చెబుతాడు కదా.'

'వాడు నన్ను గుర్తుపట్టకుండా అమావాస్య అర్ధరాత్రి నల్లదుప్పటి ముసుగేసుకు వెడతాకదా.'

'వాడు వాసన పసిగడతాడు కదా.'

'వాడు వాసన పసిగట్టకుండా సస్పెన్సు కింగ్ నవల్లో హీరోలా చెప్పులకి సున్నం రాసుకు వెడతాను కదా.....'

టామీగాడిని గుర్తుపట్టకుండా చావగొట్టడానికి కొండిగాడు ప్లాను చెప్పగానే , నా ప్రేమ వెనక్కు వెళ్ళి టామీగాడి పెళ్ళి అజెండాలో ముందుకు వచ్చింది. టామీగాడిని టపటప లాడించడానికి గొప్ప అవకాశం వచ్చిందన్న సంతోషంలో, కొండిగాడు వాడి దుర్మార్గమైన ప్లాను నా బుర్రలోకి జాగ్రతగా ఎక్కిస్తున్నాడన్న విషయం గమనించలేదు.

'ఒరే - సెకండ్ షోకి వెడదామా?' అన్నాడు కొండిగాడు. నేను మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చుంటే.

'ఏ సినిమా?'

'అమావాస్యలో పౌర్ణమి చంద్రుడు- ఈ రోజే బ్రహ్మాండమైన విడుదల - మళ్ళీ రేపుండదు. అన్నట్లు ఈ రోజు అమావాస్యరోయ్.......'

'నువ్వెళ్ళు - నేను రాను.' కొండిగాడి ప్లాను ఆ రోజు అమల్లో పెట్టేయాలని నిర్ణయానికి వచ్చేశాను.

'ఓకే' అంటూ వెళ్ళిపోయాడు కొండిగాడు.

రాత్రి పన్నెండు అవుతుండగా, తల నుంచి కాళ్ళ వరకూ నల్ల దుప్పటి ముసుగుపెట్టి, జోళ్ళకి అడుగున సున్నం బాగా పట్టించి, దుడ్డుకర్ర తీసుకుని హాలువైపుకి నడిచాను. టామీ వెధవకి రెండు పూటలా మస్తుగా తిని నన్నేడిపించడమే కాని కుక్క కుండాల్సిన లక్షణాలేవీ లేవు. నేను హాల్లో అడుగు పెట్టగానే వాడు వాడి స్వప్నలోకాల్లోంచి దిగి వచ్చి కళ్ళు తెరిచి చూశాడు. లేచి నిలబడి, నోరు తెరిచి, 'నువ్వెవడివిరా - బుచాడిలా అర్ధరాత్రి వచ్చావు?' అన్నట్లు చూశాడే కాని, దొంగ వస్తే అరవాలనే జ్ఞానం లేదు వెధవకి.

నేను గుండెల నిండా ఊపిరి పీల్చి, దుడ్డుకర్ర పైకి లేపి ఒక్కటేశాను టామీగాణ్ణి. నేనేదో వాడిని ఎంటర్‌టెయిన్ చెయ్యడానికి వచ్చిన సర్కస్ బఫూన్నన్నట్లు చూస్తున్న టామీగాడు అనుకోకుండా దెబ్బ పడడంతో ఉలిక్కిపడి ఎగిరి గంతేసేడే కాని అరవాలని కూడా తోచలేదు. రెండో దెబ్బ పడ్డాకా అది సర్కస్ కాదనీ, నేను వాణ్ణి చావగొట్టడానికి వచ్చాననీ వాడికి అర్థమై కుయ్యోమని ఏడుస్తూ గొలుసు గింజుకోవడం మొదలుపెట్టాడు.

ఆనందంగా మరో రెండు వడ్డించానో లేదో, నా ఆనందానికి అంతరాయం కలిగిస్తూ గేటు దగ్గర టాక్సీ ఆగిన శబ్దం వినిపించింది. మావగారు టాక్సీ దిగుతూ, టామీగాడి ఏడుపు వినిపించి, 'టామీగాడు ఎందుకో అరుస్తున్నాడు అమ్మాయ్,' అంటూ లోపలికి పరిగెట్టుకొచ్చారు. ఆయన గొంతు విని నేను హాల్లోంచి బయటికి దూకి ఔట్‌హౌస్ వైపు పరిగెడుతూ చీకట్లో ఆయనకు డేష్ ఇచ్చాను. ఆయన పిప్పళ్ళ బస్తాలా దబ్బుమని వెనక్కి పడి పోయారు. నేను పగరుస్తూ ఔట్‌హౌస్ వెనుక తలుపు గుండా లోపలికి పరిగెత్తి నిశ్శబ్దంగా తలుపేశాను.

చీకట్లో నన్ను గుద్దేసి కింద పడిపోవడంతో మావగారి బుర్ర క్షణకాలం పని చెయ్యలేదు. బుర్ర పని చెయ్యడం మొదలు పెట్టగానే నోరు 'దొంగ.....దొంగ' అని అరవడం మొదలుపెట్టింది.

'ఎక్కడ దొంగ?' అనడుగుతున్నాడు కొండిగాడు.

'ఇలా పెరట్లోకి పారిపోయాడు - నల్ల ముసుగేసుకున్నాడు. వాడి చేతిలో నాలుగడుగుల కఱ్ఱ కూడా ఉంది' అంటున్నారు మావగారు 'వరండా తీసి ఉందే - టామీగాడు. ఏవయ్యాడు...టామీగాణ్ణి చంపేసేరేవ్?' పది సెకండ్ల విరామం తర్వాత పెద్ద కేక వినిపించింది. నాకు దృశ్యచిత్రం కనుపించకపోయినా శబ్దచిత్రం వినిపిస్తూనే ఉంది.

మావగార్ని చూసి టామీగాడు సింపతీ కోసం ఇంకొంచెం గట్టిగా మూల్గడం మొదలుపెట్టాడు.

'ఏం జరిగింది నాన్నా - ఎవరు నిన్ను కొట్టారు నాన్నా' అంటోంది సరళ.

'నన్నెవడు కొట్టగలడమ్మా - దొంగ దెబ్బతీసి పారిపోయాడు కాని'.

'నిన్ను కాదు నాన్నా- టామీగాణ్ణంటున్నా' అంది సరళ.

'వాడు దొంగ కాదు' మావగారి కంఠం కంచుగంటలా మోగింది. ' దొంగయితే ఇంట్లో సామాను ఎత్తుకుపోతాడు కాని నోరు లేని జీవిని చంపడానికి ప్రయత్నించడు - వాడు.....' ఆవేశంలో ఆయనకు ఊపిరందక ఓ క్షణం ఆగి 'వాడు హంతకుడు - వాడెక్కడికీ పారిపోలేడు. నేను షెర్లాక్ హోమ్స్ కంప్లీట్ వర్క్స్ ఔపోసన పట్టేశాను. వాడెక్కడ దాక్కున్నా పట్టేస్తా కొండల్రావ్.....'

'ఏం సార్?'

'హంతకుడు ఔట్‌హౌస్ వైపు పారిపోతూ నాకు డేష్ ఇచ్చాడు. కొంపతీసి వాడు మన శంకరాన్ని మర్డరు చెయ్యలేదు కదా...... ' ఆయనలోని షెర్లాక్ హోమ్స్ చురుగ్గా పనిచెయ్యడం మొదలుపెట్టాడు కాబోలు '.....అయితే హంతకుడు ఇంకా ఔట్‌హౌస్‌లోనే ఉండాలి. .....అమ్మాయ్ - నువ్వు కారం పొట్లాం అందుకో. కొండల్రావ్ రుబ్బురోలు పొత్రం నాకందించి నువ్వు పందిరిరాట అందుకో' అని సైన్యాన్ని సిద్ధం చేస్తుంటే నేను కంగారుపడి తలుపు తీసి, అప్పుడే నిద్ర లేచినట్లు ఆవులిస్తూ, 'ఏవిటి సార్ - ఎప్పుడొచ్చారు' అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

'నువ్వు మర్డరైపోలేదా?' షె. హోమ్స్‌గారు నిరాశగా రుబ్బురోలు పొత్రం కిందికి దించుతూ అడిగారు.

'మర్డరేవిటి?' అన్నాను నేను కొండిగాడితో.

'ఏం లేదులే - మీరు వెళ్ళి పడుకోండి సార్ - ప్రయాణంలో అలిసిపోయారు' అని వాళ్ళని పంపించేసి లోపలికి వచ్చాడు కొండిగాడు.

'థాంక్యూ గురూ' అని కొండిగాడికి థాంక్స్ చెప్పి, 'వీళ్ళు నీకెల్లా కలిశారు' అనడిగాను.

'ఆ.....సినిమా నుంచి వస్తుంటే, వీళ్ళు స్టేషన్నుంచి టాక్సీలో వస్తూ నన్నెక్కించుకు తీసుకొచ్చారు' అన్నాడు వాడు కేజువల్‌గా.

రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వలన మావగారు వాకింగ్‌కి వెళ్ళలేదు గాని తెల్లారగానే మొక్కలకి సంగీతం వినిపించడానికి టేపురికార్డరు ఆన్ చేశారు. ఆయన స్విచ్ నొక్కగానే దాన్లోంచి బొంయిమని శబ్దాలు వచ్చి ఎగిరి గంతేశారు.



ఆయన పక్కనే ఉన్న నా గుండె జారిపోయింది.

'ఏవిటిది?' అన్నారు నా కేసి చూస్తూ.

'పాప్ మ్యూజిక్' అన్నాను నేను నీళ్ళు నములుతూ. మావగారు హఠాత్తుగా రావడంవలన కేసెట్ మార్చే టైము లేకపోయింది.

'జూ అంటుకుంటే జంతువులు బోనుల్లోంచి గోలచేసినట్టు కూతలూ, కంకర రాళ్ళు తారుడబ్బాలో పోసి మెట్ల మీంచి దొర్లించినట్టు మోతలూ - ఇది సంగీతమా? ఈ సంగీతం వింటే మనుషులకి పిచ్చెక్కుతుంది. మొక్కలు చచ్చిపోతాయి - మొక్కలు చ.........చ్చి........అయ్యో' ఆయన హఠాత్తుగా మాట్లాడడం ఆపుచేసి మొక్కల మధ్యకి పరుగెట్టారు.

మావగారు వెళ్ళిన తర్వాత మొక్కలు ఎలా ఉన్నయో వాటి మొహం చూసిన పాపాన పోలేదు. అంచేత నేను కూడా నాలుక కర్చుకుని ఆయన వెనకాలే పరిగెట్టాను ఎలా ఉన్నాయో చూద్దామని.

నవనవలాడే మొక్కలన్నీ తల నేలకేసి కొట్టుకుంటున్నట్లు వంగిపోయాయి. పొట్లకాయలు, 'ఉయార్ మేడ్, ఉయార్ మేడ్' అంటూ బ్రేక్ డాన్సు చేస్తున్నట్లు అష్టవంకర్లు తిరిగిపోయాయి. టొమోటాలు చెవులు మూసుకుంటున్నట్లు సైడు నుంచి వంకర తిరిగిపోయాయి.

'ఇది చూడు,' అన్నారు నిమ్మకాయ సైజులో ఉన్న ఓ కాయ చూపిస్తూ, 'ఇదేవిటో తెలుసా?'

'నిమ్మకాయా సార్?'

'నా తలకాయ - గుమ్మడికాయ' అన్నారు కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ.

మావగారు వెళ్ళేప్పుడు గుమ్మడి పిందెలు చూపించి, 'ఎంత పెద్దవిగా తయారవుతున్నాయో చూడు' అన్నారు గర్వంగా. కానీ, ఇప్పుడేవైందో కాని అవన్నీ నిమ్మకాయ సైజుకి కుంగిపోయాయి. అవేకాదు - బీరకాయలు బెండకాయల సైజుకీ, బెండకాయలు మిరపకాయల సైజుకీ కుంగిపోయాయి.

'నేనప్పుడే చెప్పాను - నా మాట వినకుండా వీడి పాప్ మ్యూజిక్ వినిపించి చంపేశాడు' అంటూ టామీగాడు తోటలో అటూ ఇటూ తిరుగుతూ నా మీద ఇంకా ఏం చెబుతావా అని చూస్తుంటే, వాడికి నా అడుగు ముద్ర కనిపించి కుయ్యోమని మొరిగాడు. ఏమైందిరా అంటూ మావగారు అటు పరిగెట్టారు.

'ఇవి హంతకుడి అడుగు ముద్రలే.....హ్హ హ్హ....షెర్లాక్ హోమ్స్‌ని 'నా సంగతి వాడికి తెలియదు - వాడెక్కడున్నా పిలకుచ్చుకుని ఈడ్చుకొస్తా.....' హంతకుడిని పట్టుకోడానికి క్లూలు దొరికాయన్న ఆనందంలో మొక్కల సంగతి తాత్కాలికంగా మర్చిపోయి లోపలికి పరిగెట్టారు.

'ఒరే కొండిగా - ఇంత స్పష్టంగా అడుగు ముద్రలు పడ్డాయి. ఆ సస్పెన్సు కింగ్ నన్నాసి జోళ్ళకి సున్నం రాయమని ఎలా సలహా ఇచ్చాడురా' అన్నాను దిగులుగా కొండిగాడి చెవిలో.

'వాడు కుక్కల్నుంచి తప్పించుకోవడం ఎలాగో చెప్పాడు కాని షెర్లాక్ హోమ్స్ లాంటి మావల సంగతి రాయలేదు' అన్నాడు కొండిగాడు నా చెవిలో.

ఇంతలో మావగారు పెనుసైజు భూతద్దంతో ప్రత్యక్షమయ్యారు. నేలమీద వంగి, భూతద్దంలో గడ్డి నలిగిన గుర్తులూ, సున్నపు మరకలూ - అంతా పరిశీలిస్తూ తిన్నగా నా గదిలోకి వచ్చేశారు.

'హంతకుడు నీ గదిలోకి ఎలా వచ్చాడు?' అనడిగారు అనుమానంగా.

'నాకు తెలియదు సార్,' అన్నాను తడబడుతూ.

ఆయన అటూ ఇటూ చూస్తూ గదిలో అడుగుపెట్టగానే, తలుపు పక్కన కఱ్ఱ



కనుపించింది. 'ఇదేవిటి?' అన్నారు ఇంకొంచెం అనుమానంగా - టేపుతో కర్ర పొడుగు కొలుస్తూ.

ఈలోపున టామీగాడు డా॥ వాట్సన్‌లా గదంతా పరిశీలిస్తూ మంచం కింద దూరి, అక్కడి నుంచి నల్ల దుప్పటి బయటికి లాగాడు అరుస్తూ - మరో క్లూ దొరికింది.

'ఇదేవిటి?' అని గర్జించారు నల్లదుప్పటి నా కళ్ళ ముందు ఆడిస్తూ.

ఆయనలా అడుగుతుండగా టామీగాడికి ఈసారి నా చెప్పుల జతకూడా కనుపించి, 'మిస్టర్ హోమ్స్' అనరిచాడు, మావగార్ని పిలుస్తూ. మావగారు చేతికర్ర చెప్పుల్లో దూర్చి పైకి లేపి, భూతద్దంతో సోల్ జాగ్రతగా పరిశీలించి, కిందికి దించి, ఓసారి గుర్రుమని పైకీ కిందకూ మీసాలు ఆడించి, నా కళ్ళల్లో కళ్ళు పెట్టి తీవ్రంగా చూస్తూ, 'హంతకుడి సంజాయిషీ ఏవిటి?' అని గాండ్రించారు.

'హంతకుడెవరు సార్?'

'మృత్యు సంగీతం వినిపించి నా మొక్కల్ని హింసించిన శాడిస్టు. అడ్డువచ్చిన టామీగాణ్ణి - నోరులేని వాడు - వాణ్ణి హత్య చేద్దామని ప్రయత్నించిన నరరక్త... ...కుక్కరక్త.....రక్తపిపాసి' అంటూ మావగారు నా మీదకు దూకబోతుంటే కొండిగాడు దేవుడిలా అడ్డుపడి, 'మీరొకసారి ఇలా రండి సార్' అని మావగార్ని బయటకు లాక్కెళ్ళిపోయాడు.

ఓ అయిదు నిమిషాలు బయట అరుపులు, కేకలు వినిపించాయి. నన్ను సుప్రీం కోర్టు దాకా ఈడ్చుకెడతారుట - నా సంగీతంతో వాతావరణ కాలుష్యం చేసి మొక్కల్ని చంపేస్తున్నానని భారత ప్రభుత్వ పర్యావరణ శాఖవారికి నివేదిస్తారుట - జీవకారుణ్య సంఘం వాళ్ళని తీసుకొచ్చి నా గది ముందు ధర్నా చేయిస్తారుట - ఈ కేకల మధ్య కొండిగాడు ఏం చెప్పాడో సరిగా వినిపించలేదు కాని, కొంచెం సేపటికి మావగారి కేకలు పూర్తిగా తగ్గిపోయాయి. కొండిగాడు, 'అమావాస్య - పౌర్ణమి' అంటూ ఏదో చెబుతున్నాడు. 'నాకిదివరకు టామీగాణ్ణి కొట్టినప్పుడే డౌటొచ్చింది సుమా. అయ్యో పాపం - చిన్న వయసులో - ఆ వెధవ సంగీతం వింటే అలాగే అవుతుంది - నువ్వు జాగ్రత - ఎందుకైనా మంచిది' అంటున్నారు మావగారు మెల్లిగా. మరో రెండు నిమిషాల తర్వాత అంతా నిశ్శబ్దమై పోయింది. కొండిగాడు జేబురుమాలుతో మొహం తుడుచుకుంటూ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

'ఏం చెప్పావ్ - అలా పిల్లిలా వెళ్ళిపోయారు మావగారు' అన్నాను నేను మంచం కింద నుంచి లేస్తూ.

'ఏదో సర్ది చెప్పేశాలే.'

'నేను బయటికి వెళ్ళగానే ఏ పొద చాటునుంచో హఠాత్తుగా మీదకు దూకి మెడపట్టుకు కొరికెయ్యదు కదా ముసలిపులి?'

'ఏవీ ప్రమాదం లేదు.'

'థాంక్యూ గురూ - పెద్ద ప్రమాదం నుంచి రక్షించావు' అన్నాను నేను గట్టిగా ఊపిరి పీలుస్తూ.

'చూశావా నేను ఎంత జెంటిల్మన్‌నో......' అన్నాడు కొండిగాడు. వాడు జెంటిల్మన్ అని నేనూ ఒప్పుకున్నాను.

తర్వాత ఒకటి రెండు రోజులు మావగారి కంట పడకుండా తప్పించుకున్నాను. కానీ, మూడో రోజు ఆయన కంట పడక తప్పలేదు.

'ఆరోజు నా ప్రవర్తనకి చాలా సిగ్గుపడుతున్నాను' అన్నాను సిన్సియర్‌గా క్షమార్పణలు చెబుతూ.

' ఏ ప్రవర్తన?' అన్నారు ఆయన ఏవీ గుర్తులేనట్లు.

'మొక్కలు.....టామీగాడు;

'ఆ సంగతి నేనప్పుడే మర్చిపోయానోయ్' - నువ్వింకా అదే మనసులో పెట్టుకున్నావా - ఛ....ఛ...తప్పు కాదూ- నువ్వు అసలు అలా సీరియస్‌గా ఆలోచించకూడదు - నీ ఆరోగ్యానికి మంచిది కాదు - అయినా, నువ్వు తెలిసి చేసేవా ఏవిటి?' అన్నారు ఆయన అభిమానంగా.

'తెలిసి చేసేవా అంటాడేవిటి?' అని నేను ఆలోచిస్తూ ఆయన్ని ఏదో అడగబోతుంటే, ఆయన భూమి మీద 72 కేజీలుండే మనిషి చంద్రమండలం మీద ఎంత బరువుంటాడు? కుజగ్రహం మీద ఎంత బరువుంటాడు' అనడిగి నన్ను వాయేజర్- 2 ఎక్కించి, సౌరకుటుంబ యాత్రకు తీసుకుపోయారు - మారు మాట్లాడనివ్వకుండా.

* * *

శంకరం అతని కథ అలా చెబుతుండగా, బీచ్‌లో అటూ ఇటూ పరిగెడుతూ, పరిచయస్థులు కనిపించినప్పుడు తోక ఊపి పలకరిస్తూ వస్తున్న టామీగాడు మమ్మల్ని దాటి కొంచెం దూరం పరిగెట్టి, మళ్ళీ ఏదో అనుమానం వచ్చి వెనక్కు తిరిగి, మాకు నాలుగడుగుల దూరంలో ఆగి, శంకరం కేసి, 'వీణ్ణెక్కడ చూశాను చెప్మా' అన్నట్లు పరిశీలనగా కళ్ళు చికిలించి చూశాడు.

'ఛీ........ఛీ.......' అన్నాడు శంకరం టామీగాడితో.

వాడు శంకరాన్ని గుర్తుపట్టి నాలుగడుగులు వెనక్కి గెంతి, 'సు వ్వే....భీ.......భీ.....' అన్నాడు.

'పో..........పో..'

'భో........భో...'

'కాళ్ళిరగ్గొడతాను వెధవా' అన్నాడు శంకరం.

టామీగాడు ఏవనేవాడో కాని, 'నోరు లేని వాడురా - వాణ్ణెందుకు కొట్టడం' అన్నాడు టామీగాడి వెనకాలే వస్తున్న కొండల్రావు.

'వాణ్ణి కాదు - అసలు నిన్ను తన్నాలి' అన్నాడు శంకరం ఉక్రోషంగా.

'జెంటిల్మన్‌ని - నన్ను తన్నడం దేనికి?'

'మావగారు ఆరోజు రాత్రి వస్తున్నట్లు. నీకు టెలిగ్రాం వచ్చిందా?'

'వచ్చింది.'

'నువ్వు అంతా తెలిసే మావగారు వచ్చే టైముకి టామీగాడి పెళ్ళి ముహుర్తం పెట్టావా?' 'పెట్టాను.'

'మావగారితో నాకు అమావాస్యకీ, పౌర్ణమికీ పిచ్చెక్కుతుందని చెప్పావా?'

'చెప్పాను.'

'ఎందుకు చెప్పావు?'

'సరళకీ నాకూ మధ్య ఉన్నది ప్రేమ - నీకూ నాకూ మధ్య ఉన్నది యుద్ధం. నిన్ను తన్ని తగలెయ్యకపోతే నా పెళ్ళెలా అవుతుంది? ఎవ్విరి థింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్ అన్నారు పెద్దలు.....'

'ఆ పెద్దలే మూడో క్లాసులో చెవి మెలిపెట్టి, కలుసకు నిలువెల్ల విషము గదరా సుమతీ.....'

> పరిచయస్థులు కనిపించినప్పుడు తోక ఊపి పలకరిస్తూ వస్తున్న టామీగాడు మాకు నాలుగడుగుల దూరంలో ఆగి, శంకరంకేసి 'వీణ్ణెక్కడ చూశాను చెప్మా' అన్నట్లు కళ్ళు చికిలించి చూశాడు.

'కలుసకు కాదు గాడిదా - ఖలునకు - వత్తు 'ఖ' - వెంకటాచలం మేష్టారి చేత అన్ని మొట్టికాయలు తిన్నా నీకు వత్తు పలకడం రాలేదు.....ప్చ్....నీకు తెలియని రహస్యం ఇంకోటుంది - చెప్పనా?' 'ఏడు.'

'అసలు మావగారు సరళని నీకే ఇవ్వాలని ముహూర్తం కూడా పెట్టించేశారు. నీ సంగతి తెల్సిన తర్వాత పిచ్చివాడితో పెళ్ళి తప్పించినందుకు కృతజ్ఞతగా నాకిచ్చి అదే ముహూర్తానికి పెళ్ళి చేసేశారు..........'

'అమ్మ దొంగవెధవా...' అంటూ శంకరం ఏదో అనబోతుంటే, 'నువ్వా శంకరం - నీ ఆరోగ్యం .....ఎలా ఉంది ఇప్పుడు? అదేవిటి- అలా గెడ్డాలూ, మీసాలూ పెంచేశావేమిటి బూచాడులా?' అంటూ ముసలాయన వచ్చారు.

'అదేవిటి శంకరంగారూ - మీరు మా పెళ్ళికి రానేలేదు - ఆయన కూడా ఎంతో బాధపడ్డారు' అంది సరళ.

'ఎవరు?' అన్నాడు శంకరం పళ్ళు నూరుతూ. అంత సముద్రపు హోరులోనూ తిరగలిరాయి మోత నాకు స్పష్టంగా వినిపించింది.

'నేనే - చూశావా ఎంత జెంటిల్మన్‌నో' అన్నాడు కొండల్రావు నవ్వుతూ.

'ఇంకా ఆ కూతల సంగీతం వింటున్నావా - వినకు - అది నీకు అసలు మంచిది కాదు - మంచి సంగీతం మైండుని ప్రశాంతంగా ఉంచుతుంది. కూతల సంగీతం మెదడుని డిస్టర్బు చేసి పిచ్చెక్కిస్తుంది..........' అని ఆల్ఫా, బీటా, తీటా తరంగాల గురించి సీరియస్‌గా శంకరానికి లెక్చరిస్తున్న ఆయన హఠాత్తుగా ఆగిపోయి, నోరు మూసుకోవడం కూడా మర్చిపోయి, షాకు తగిలినట్లు ఆకాశం కేసి చూస్తూ విగ్రహంలా నిలబడిపోయారు. క్షణం తర్వాత తేరుకుని శంకరం కేసి ఓ సారి చూసి, కంగారుగా సరళకేసి తిరిగి, 'అమ్మాయ్ - పద' అంటూ ఓ కేక వేసి పరుగు తీశారు.

'ఏవిటి నాన్నా?'అంటూ వెనకాలే వెళ్ళిన సరళ చెవిలో ఆయన ఏదో చెప్పారు. 'అమ్మో' అంటూ సరళ పరిగెట్టుకొచ్చి, 'రా నాన్నా - క్విక్' అంటూ టామీగాణ్ణి ఈడ్చుకుపోతూ, 'ఏవండీ - మీరు వచ్చెయ్యండి' అని కొండల్రావుని కూడా పిలిచింది.

'ఏవిట్రా కొండిగా - వాళ్ళు ఉన్నట్టుండి అలా కంగారుగా పరిగెడుతున్నారు' అనడిగాడు శంకరం తెల్లబోయి.

'నువ్వు ఇవాళ విశ్వరూపం చూపిస్తావేమోనని మావగారికి భయం వేసింది కాబోలు' అన్నాడు కొండల్రావు పగలబడి నవ్వుతూ.

'విశ్వరూపమేమిటి?'

కొండల్రావు చిన్నగా విజిలేసి, ఆకాశం కేసి చూపిస్తూ కన్ను గీటి నవ్వాడు. శంకరం తలెత్తి చూసి రెండు చేతుల్లోనూ తల పట్టుకుని కూలబడిపోయాడు.

ఏవిటా అని నేను ఆశ్చర్యపోయి తలెత్తి చూశాను.

ఎగిరి పడుతున్న సముద్రం మీద ఆకాశంలో పౌర్ణమి చంద్రుడు నిండుగా వెలుగుతున్నాడు. ■